# ప్రణయసరణి

## ౧

'పోనీ ఇప్పటికయినా తీరింది'

'మీకు ఇప్పటికిగూడా తీరలేదుగా?'

'నీకు తీరకనా, మీవాళ్ళకుతీరకనా ఇన్నాళ్ళాలస్యం చేసింది?'

'రమ్మని ఒక కార్డుముక్క వ్రాయడానికి మీకుతీరక. తెలిసిందా? చేతిముత్యాలు రాలిపోతాయి కాబోలు వ్రాస్తే?'

'రాదలుచుకున్నవాళ్ళకు రమ్మని వ్రాయనవసరము లేదు. రాదలుచుకోనివాళ్ళకూ రమ్మని వ్రాయనవసరములేదు. ఇహ కార్డుముక్క అవసరమేముందీ?'

'చాల్లెండి నేర్చుకుపోయారు! మీరేమిచేసినా మీకు బాగానేఉంటుంది. ఇతరులు ఆ అంటే తప్పు ఊ అంటే తప్పు నారాయణ అంటే...'

'ఏమి టీ ఉపన్యాసం? మీఊళ్లో ఆడవాళ్ళ క్లబ్బులో ఉపన్యాసాలు అలవాటుచేసుకొని వచ్చినట్టున్నావే?'

'అవును మాట్లాడితే ఉపన్యాసమే. పోనీ ఒక్క కార్డు వ్రాయగూడదూ?'

'ఎందుకు వ్రాయగూడదూ? వ్రాసిందాకా ఉంటే బాగుండేదికాదూ?'

'నెలలా, సంవత్సరాలా?'

'వ్రాసిందాకానూ. అయినా తీరావచ్చి, కార్డు వ్రాయలేదని సాధింపేమిటి? కార్డు వ్రాయలేదని మనస్సులో ఉన్నదానవు అది వచ్చిందాకా ఉంటే భేషు. ఈతడవ అట్లా......'

'ఇంకా ఈతడవగూడానూ సిగ్గులేక. ఇహ పోనే పోను లెండి'

'ఇహ ఎట్లా నేనుండలేను నీవుపుట్టింటికి పోకపోతే'

'అలాగే ఉంటుందిలెండి. తలనొప్పి, దరిద్రం తనదాకావస్తేనేకాని తెలియవుట. ఓ నాలుగురోజులు అమ్మను నాన్నను చూడకుండా ఉండలేరుగాని'

'నిజమే. అయితే సరేకాని ఏం హడావుడిగా గదిలోకి దయచేశావు?'

'ఊరికేనే. రాకూడదా? వెళ్ళుతాలెండి'

'............................'

'మరెందుకూ చెంగుపట్టుకోవడం. వదలండి. నన్ను వెళ్ళనివ్వండి' (పోకుండా వెనక్కుతగ్గుతూ)

'కోపము వచ్చినట్లుందే నిమిషంలో?'

'చేతగానికోపం ఎందుకూ నాకు?'

'చేతనయితే ఏంజేస్తావో?'

'కోపమట! ఉత్తరం వ్రాయకపోగా......గదిలో పనుండదు గామాలు?'

'ఉండనీ. దానికి కోపమెందుకు?'

'ఆ ప్రశ్నేమిటి? హృదయంలో అంతకాఠిన్యం ఎలా సంభవమో నాకర్థంగావడంలేదు మాకు చేతగాదు సుమండీ.'

'బొత్తిగా చేతగాదు. కార్డు వ్రాయలేదని నెలరోజులు రావడం మానుకున్నావుగాని'

'నేను సాధించానన్నారుగాని మీసాధింపు బాగుందేమిటి?'

'మను బాగుందా? నన్ను అడిగిందా?'

'బాగుండకూ? నేనక్కడ ఉన్నానని రాకపోతే మానె మనూ, విశ్మి ఎంతో కలవరించారు బావబావని. వాళ్ళను చూడడానికైనా రాకూడదూ?'

'వాళ్ళను చూడడానికి నీవక్కడుండగానే రావాలెనని ఏధర్మశాస్త్రంలోనూ లేదే?'

'పోనీ నేనున్నాననే రావచ్చునుగా?'

'ఆమాట నీవు మొదటఅనలేదే?'

'ఎప్పుడో అప్పుడన్నాను మీరు రానిదానికి ఎప్పుడంటేనేమి?'

'తీరలేదు'

'అవును! పాపం!! బొత్తిగా తీరికేది? అందులో మీముత్తా కసలే తీరికలేదు. బయాస్కోపులు, నాటకాలు, విందులు, క్లబ్బులు, చీట్లపేకలు...'

'కొంచెం సాక్షిపోకడకూడా సంపాదించావే. కానీ'

'మను. అక్కా బావను చూడాలనే, నేనుకూడా వస్తానంది'

'తీసుకు రాకపోయినావు?'

'మరీ బాగుంది. ఒకకార్డైనా దాన్ని తీసుకురమ్మని వ్రాయలేదు గాని...'

'మళ్ళీ ముక్తాయింపుకార్డుమీదికి వచ్చిందీ? చిన్నవాణ్ణి నాకేంతెలుస్తుంది కార్డువ్రాయడం, మర్యాదానూ? పెద్దవాడు, ఒకరికి చెప్పనేర్చినవాడు మీనాన్నే నిన్ను తీసుకువెళ్ళుతూ, మాటవరసకైనా నన్ను రమ్మనక పోవచ్చు?'

'ఏదో సాధిస్తూనేఉంటారు ఎప్పుడూనూ. నాకు పనుంది వెళ్ళనీయండి.

'వెళ్ళు. ఎవరువద్దన్నారు? నీపనికాగానే నీవువెళ్ళక పోయినావు?'

'అవును. అవును. అంతేలెండి.'

మాట్లాడినంతసేపూ అతని ఉత్తరీయంకొంగు వేలికి వేసుకొని మెలేబెట్టుతూనేఉన్నది ఇందిర. 'అవును. అవును అంతేలెండి' అని తలఊగిస్తూ బలవంతంమీద అతని వాటులోనుంచి తప్పించుకొనిపోయింది. ఆ సమయంలో ఆమెకండ్లలో వెల్లివిరిసిన సౌందర్యానికి ఆమె కండ్లు తనివితీరా ముద్దాడవలెనని అతనికి ప్రబలమైన ఉద్దేశం కలిగిందిగాని ఆమె చిక్కలే.

౨

భార్యాభర్తలిద్దరూ కలుసుకొని నెలరోజులైంది. ఒకర్నివిడిచి ఒకరు ఉండలేకపోయినమాట కూడా నిజమే.

అందుకనే వచ్చీరావడంతోటే భర్తగదిలో ఉన్నాడా అని చూచి భర్తతో కులాసాగా మాట్లాడవలెనని వెళ్ళింది ఇందిర.

పుట్టింటఉన్న నెలరోజులలోనూ నాలుగుసార్లు ప్రయాణమయింది. 'ఇంటిదగ్గర బొత్తిగా అన్నం అమరదమ్మా. మా అమ్మమ్మ పెద్దది. వేళకుచేయడమూ చేతగాదు. కనపడీ కనపడక అన్నీ మాడ్చి వేస్తుంది' అని ఏవేవో సాకులుచెప్పింది బయలుదేరడానికి.

వాళ్ళ అమ్మ పడనివ్వలేదు కార్డుఅయినా రాలేదనే కారణంచేత. ఇందిరా కొంచెం బెట్టుసరిచేద్దామని అనుకున్నది.

భాస్కరుడు మాత్రం భార్యను చూడాలెనని ఉబలాటపడకపోలేదు. అయితే మామగారితో పదిరోజులలో పంపమన్నాడు. పదిరోజులలో రాకపోతే అతనూ బెట్టుసరిచేశాడు.

అతని నాయనమ్మ 'పిల్ల అక్కడఉండగా వెళ్ళి రారా నాయనా' అని రెండుమూడుమాట్లు ప్రోద్బలంచేసింది. 'మాటవరసకయినా రమ్మనంది ఏమి వెళ్ళి రానమ్మా' అన్నాడు.

'మనపిల్ల ఉన్నప్పుడు వాళ్ళు రమ్మనేదేమిటి అన్న'దావిడ.

'కాదులే. నాకు తీరదన్నాడు' భాస్కరుడు. పదిరోజులలో వాళ్ళు రాకపోతే ఉత్తరంవ్రాయమని నిర్బంధించింది. సరేలే సరేలే అని చివరకు వ్రాశాలే అని తప్పించుకున్నాడు.

చివరకు భాస్కరుడిబెట్టుసరే గెలిచింది.

ఇందిర మూర్ఖంచేసి 'వెళ్ళకపోతే మీ అల్లుడికి కోపంవస్తుంద'ని బయలుదేరింది. రాగానే భర్తతో మాట్లాడడానికి గదిలోకివెళ్ళింది. అక్కడా అతనే గెలిచాడు. ఇద్దరి ఉబలాటమూ ఒక్కటే అయినా అతను తొణకనందువల్ల ఆమె ఓడిపోయినట్టు తేలింది.

౩

సాయంత్రం భర్తకు గదిలో ప్రక్కసర్ది, తమలపాకులు చుట్టిపెట్టి, వంటచేయడానికి మడిగట్టుకున్నది. ఇందిర.

భాస్కరుడు షికారువెళ్ళి స్నేహితులు సినిమాకు రమ్మంటున్నా 'కొంచెంపనిఉన్న'దని ఇంటికి వచ్చాడు.

భార్య వంటచేయడం చూచి నాయనమ్మతో 'నాయనమ్మా! పాపం వంటచేయడం అలవాటు బొత్తిగా తప్పిందికామాలు. ఈపూటకు అట్లాగే నీచెయ్యి కాల్చుకోక పోయినావు ?' అన్నాడు.

'నేను అమాటే అన్నానురా, నాయనా నెలరోజులనుంచీ వండుతున్నదాన్ని ఈ ఒక్కపూట వండలేకపోతానా ? మీ ఇద్దరికీ ఒకసారే అన్నము పెడతాను. పనిత్వరగా అవుతుంది అన్నాను. వినలేదు.'

'పైగానా ? ఇన్నిరోజులు నిన్ను వేధించడంగాకుండా, నేవచ్చిగూడా నీకెందుకూ ఇబ్బంది. త్వరగారావలెనని తొందరపడ్డా వీలుకాలే.'

'పోనీలే ! ఇబ్బందేముంది ?'

'భాస్కరుడు స్నానంచేసి భోంచేస్తూ 'వంటచేశావుగా. భోజనానికి కూర్చోకపోయినావు నాయనమ్మ వడ్డించేది ? పొద్దున ఎప్పుడు భోంచేశావో?' అన్నాడు. ఇందిర ఎందుకు లెమ్మని తానే వడ్డించింది.

భోంచేసి వెళ్ళి తములపాకులు వేసుకుని పడుకున్నాడు. ఒకపావుగంట అలాగే ఏదో చదువుతూ పడుకున్నా ఇందిర ఇంకా వచ్చేప్రయత్నంలో ఉన్నట్టు కనపడలే. చదువు సాగకపోతే పేపర్ను ఆడుకుంటూ కూర్చున్నాడు.

ఎంతసేపటికి ఇందిర రాలేదు. తొమ్మిదయింది. ఇంకా పనికాలేదా అని చూస్తే ఇందిర అమ్మమ్మ మంచంప్రక్కన మంచంవేసుకుని పడుకుంది.

'ఇక్కడ గాలి ఇంకాచల్లగానే ఉంటున్నదే మంచుకూడా కురుస్తున్నది. లోపలపడుకోక పోయినావా ?' అన్నది అమ్మమ్మ.

'లోపల ఉక్కబోసేట్టుంది' అని ఇందిర జవాబిచ్చింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నారు.

భాస్కరుడు కొంచెంసేపు అలాగే ఆడుకొని పడుకున్నాడు. నిద్రమాత్రం పట్టలేదు. లేచి వాకిట్లోకి నాళ్ళమంచాల ప్రక్కగానే నడిచి వెళ్ళాడు. ఇందిర లేచి నుంచొని భాస్కరుడు గదిలోకి వెళ్ళగానే మళ్ళీ పడుకుంది.

వెళ్ళుతూ, వస్తూ భాస్కరుడు ఇందిరవైపు చూశాడు. కాని ఇందిర అతనివైపు చూడలేదు.

కొంచంసేపుఆగి భాస్కరుడు 'తమలపాకులు, పోకచెక్కలు ఇచ్చిపో' అన్నాడు.

'అదేమిటమ్మా అక్కడ ఎదురుగానేఉంటే? ఈ మధ్య చత్వారంగూడా వచ్చిందాఏమిటి ?

కిక్కురుమనకుండా అమిగిలిన తమలపాకులు మళ్ళీ వేసుకున్నాడు.

* * * *

మళ్ళీ కొంచంసేపు అయినతర్వాత.

'కానినిమంచినీళ్లు కావాలెనోయి' అన్నాడు.

'అక్కడే ఉన్నయిచూడండి, పట్టెమంచం క్రింద చెంబూ గ్లాసూనూ ?'

భాస్కరుడు చప్పుడుగాకుండా అనీళ్లు కిటికీలోనించి క్రింద పారపోశాడు.

* * * *

మళ్ళీ ఒక అయిదునిముషా లయింతర్వాత.

'మంచినీళ్ళు ఇంకాసిని ఇచ్చిపో' అన్నాడు.

'అన్నీ అప్పుడే తాగేశారాయేమిటి ?' అంటూ ఇందిర ఇంట్లోకివెళ్ళి సన్నని కుప్పడంఅంచు తెల్లగా ఇస్త్రీచేసిన చీరెగట్టుకుని, చక్కగా సింగారించుకొని నీళ్లుతీసుకుని గదిలోకివచ్చింది.

భాస్కరుడు కదలకుండా పడుకున్నాడు. 'మంచినీళ్ళివిగో' నన్నది ఇందిర. అతను కదలలేదు. ఇందిర చక్కిలిగింత పెట్టింది. భాస్కరుడు నవ్వుతూదొర్లాడు. లేచికూర్చున్నతర్వాత మంచినీళ్ళు అందించింది. చెంబు నోటిదగ్గరైనా పెట్టుకోకుండా అక్కడబెట్టి ఇందిరను దగ్గరకు తీసుకున్నాడు.

'ప్రొద్దుటిబెట్టుసరేమయింది ?' అన్నది ఇందిర.

'ప్రొద్దునలేనిబెట్టుసరి ఇప్పుడెక్కడనుంచి వచ్చిందీ' అన్నాడు భాస్కరుడు.

—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ బి. ఏ.